

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

నారాయణఖేడ్, ఫిబ్రవరి 10: విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నేడు ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్టు విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష, గౌరవ అధ్యక్షులు నర్సింహులు, ముత్యాల కిష్టయ్య ప్రకటనలో తెలిపారు. పరీక్షలు, శస్త్రచికిత్సలు అవసరమైనవారికి హెల్త్‌కార్డు ద్వారా చేయించి ఆసుపత్రి వాహనంలోనే ఇంటి వద్ద దిగబెడతారని పేర్కొన్నారు. విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబీకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రెవెన్యూ అధికారుల బదిలీలు

సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 10: సంగారెడ్డి జిల్లాలో ముగ్గురు రెవెన్యూ అధికారులు, ఆరుగురు తహసీల్దార్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్‌మిట్టల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సంగారెడ్డి డీఆర్వోగా ఉన్న మెంచు నగేష్‌ను రెవెన్యూశాఖలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. జహీరాబాద్ నిమ్జ్ ప్రాజెక్టులో డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న కె.మహిపాల్‌ను హైదరాబాద్‌లోని అర్బన్ ల్యాండ్ సీలింగ్ విభాగంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ చేశారు. జహీరాబాద్ నిమ్జ్‌లో పనిచేస్తున్న డిప్యూటీ కలెక్టర్ ఆర్‌వీ రాధాబాయిని సిరిసిల్లా ల్యాండ్ అక్విజిషన్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమించారు. అలాగే, సంగారెడ్డి కలెక్టరేట్‌లో పనిచేస్తున్న తహసీల్దార్ నఫీస్ ఫాతిమా వికారాబాద్‌కు, జిన్నారం తహసీల్దార్ బి.రవికుమార్ యాదాద్రికి, సంగారెడ్డి కలెక్టరేట్‌లో పనిచేస్తున్న తహసీల్దార్ పి.దశరత్, జహీరాబాద్ ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్న సదానందం, అందోల్ ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్న స్వర్ణలతను హైదరాబాద్‌కు, హత్నూర తహసీల్దార్ ఎస్.సంధ్యను వికారాబాద్‌కు బదిలీ చేశారు. ఏప్రిల్‌లో రిటైరవనున్న మనూరు తహసీల్దార్ ఎస్వీఆర్ మహేష్‌కుమార్, అమీన్‌పూర్ తహసీల్దార్ ఎస్.గౌరీవత్సలను సూపరింటెండెంట్లుగా నియమించారు.

వైద్య ఆరోగ్యశాఖలో 151 మంది డిప్యూటేషన్లు రద్దు



సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 10: వైద్య ఆరోగ్యశాఖలో డిప్యూటేషన్లు రద్దు చేయడంతో సంగారెడ్డి జిల్లాలో 151 మంది సొంత స్థానాల్లో రిపోర్టు చేశారు. వీరిలో జిల్లా వైద్య ఆరోగ్య ప్రజారోగ్యశాఖ పరిధిలో (డీహెచ్) 78 మంది, తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలో (టీవీవీపీ) 70 మంది, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలో (డీఎంఈ) ముగ్గురు ఉన్నారు. డిప్యూటేషన్లు రద్దయినవారిలో ఆఫీస్ సబార్డినేట్ క్యాడర్ నుంచి డాక్టర్లు, ఉన్నతాధికారుల వరకు ఉన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో వారంతా వెంటనే రిలీవ్ అయి సొంత పోస్టింగులకు వెళ్లిపోయారు. ఇకపై ఏ క్యాడర్ ఉద్యోగినైనా డిప్యూటేషన్‌పై పంపాలంటే జిల్లా కలెక్టర్ సిఫారసు తప్పనిసరి అని ప్రభుత్వ ఆదేశాల్లో పేర్కొన్నారు. మరోవైపు డిప్యూటేషన్లు రద్దుచేసి మూడు రోజులు కూడా కాకముందే కొందరు ఉద్యోగులు తమకున్న పలుకుబడి, మంత్రులు, ప్రజాప్రతినిధులతో పరిచయాలతో మరోసారి డిప్యుటేషన్ కోసం ప్రయత్నాలు ప్రారంభించారు.

మెదక్‌లో ఈవీఎంల తనిఖీ ప్రక్రియను పరిశీలించిన డిప్యూటీ సెక్రటరీ



మెదక్‌లో ఈవీఎంల ఎఫ్ఎల్‌సీని పరిశీలిస్తున్న అధికారులు

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 10: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార యంత్రాంగం సిద్ధమవుతున్నది. ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న ఎఫ్ఎల్‌సీ ప్రక్రియను శనివారం ప్రత్యేక పరిశీలకుడు, డిప్యూటీ సెక్రటరీ మురళీమోహన్ పరిశీలించారు. ఈవీఎం, సీయూ, బీయూ, వీవీ ప్యాట్‌ల సమస్యలు, వాటి పరిష్కరాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ రమేష్, ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, సూపరింటెండెంట్ హర్దీప్‌సింగ్ తదితరులు ఉన్నారు.

అలియాబాద్, సిద్దాపూర్‌లో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు

- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి సానుకూలత
- కలెక్టర్, ఆర్డీవోలకు ఆదేశాలు
- గతంలో కాంగ్రెస్ సర్కారు ఇచ్చిన పట్టాలను ఆపిన బీఆర్ఎస్
- మంత్రికి వివరించిన మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఫిబ్రవరి 10: సంగారెడ్డి నియోజకవర్గంలోని అర్హులైన పేదలకు త్వరలోనే కొండాపూర్ మండలం అలియాబాద్, సదాశివపేట మండలం సిద్దాపూర్‌లో ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.. కలెక్టర్, ఆర్డీవోలను ఆదేశించారు. ఈ ప్రాంతాల్లో సుమారు 9వేల మంది పేదలకు గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించిందని మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మంత్రి శ్రీనివాస్‌రెడ్డి శనివారం గాంధీభవన్‌కు రాగా ఆయనను జగ్గారెడ్డి కలిసి ఇళ్ల స్థలాల విషయం వివరించారు. కొండాపూర్ మండలం అలియాబాద్‌లో నాలుగు వేల మందికి, సదాశివపేట మండలం సిద్దాపూర్‌లో ఐదు వేల మందికి ఉమ్మడి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్ల స్థలాలను ఇచ్చిందని తెలిపారు. తాను ఇళ్ల పట్టాలు ఇప్పిస్తే తరువాత వచ్చిన బీఆర్ఎస్ సర్కారు ఇవ్వకుండా దాటవేసిందని తెలియజేశారు. పట్టాలు చేత పట్టుకుని పొజిషన్ కోసం పేదలు అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండాపోయిందని పేర్కొన్నారు. పట్టాలు పొందిన పేదలకు పొజిషన్ ఇవ్వకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేసిందని వివరించారు. పేదలతో కలిసి తాను పలుమార్లు ఆందోళన చేసినా పట్టించుకోలేదని విమర్శించారు. పేదల పక్షపాతిగా ఉండే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినందున తమ హయాంలో అలియాబాద్, సిద్దాపూర్‌లలో ఇచ్చిన ఇళ్ల పట్టాలకు వెంటనే పొజిషన్ ఇప్పించాలని మంత్రిని కోరారు. గతంలో మంజూరు చేసిన ప్రకారం ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్నాయని ఆయన వివరించారు. ఇందుకు స్పందించిన మంత్రి శ్రీనివాస్‌రెడ్డి జిల్లా కలెక్టర్, ఆర్డీవోలకు ఫోన్ చేసి గతంలో ఇళ్ల స్థలాలు పొందిన అర్హులైన పేదలకు పొజిషన్ ఇప్పించాలని ఆదేశించినట్టు మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తెలిపారు.



రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి

సంగారెడ్డి జిల్లాకు 18 వేల ఇళ్లు

స్థలం ఉంటే ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు





- ప్రతీ మండలంలో పబ్లిక్ స్కూల్
- రూ.2 లక్షల లోపు రుణాలు మాఫీ
- సాగునీటి ప్రాజెక్టులకు ప్రత్యేక కేటాయింపులేవీ?
- మెట్రోరైలు, రెవెన్యూ డివిజన్ల ప్రస్తావన లేదు
- ఏడుపాయల, మెదక్ రింగురోడ్డుకు దక్కని నిధులు
- రాష్ట్ర బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి/మెదక్, ఫిబ్రవరి 10: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సంగారెడ్డి జిల్లాలో పేదల కోసం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంను ప్రభుత్వం చేపట్టనున్నది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శనివారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2024-25 ఆర్థిక సంవత్సరం మధ్యంతర బడ్జెట్‌లో ఈ విషయాన్ని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తామని ఆయన తెలిపారు. ఈరకంగా సంగారెడ్డి జిల్లాలోని ఐదు నియోజకవర్గాలతో పాటు నర్సాపూర్ నియోజకవర్గంలోని హత్నూర మండలంతో కలిపి సుమారు 18వేల ఇందిరమ్మ ఇళ్లను ఈ ఏడాది నిర్మించనున్నట్టు ఆయన తెలిపారు. ఈ రకంగా మెదక్ జిల్లాలో సుమారు 8వేల ఇళ్ల నిర్మాణం జరుగనున్నది. అలాగే ఇంటి స్థలం ఉండి, ఇళ్లు కట్టుకోలేని పేదలకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తామన్నారు.

మండలానికో పబ్లిక్‌స్కూల్

జిల్లాలోని ప్రతీ మండలంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ప్రభుత్వం ఈ ఏడాది ఏర్పాటు చేయనున్నది. ఆధునాతన వసతులు, అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటు కానున్నాయి. మండల కేంద్రాల్లో ఈరకమైన స్కూళ్లను ఏర్పాటు చేయడమంటే పేదవారికి మెరుగైన విద్యావకాశాలను అందించడమే అవుతుంది. సంగారెడ్డి జిల్లాలో 28 మండలాలో, మెదక్ జిల్లాలో 15 మండలాలలో ఈ స్కూళ్ల ఏర్పాటు ఏర్పాటు కానున్నాయి.

రుణమాఫీపై సానుకూలత

ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రకటించిన రైతులకు రూ. 2లక్షల లోపు రుణమాఫీకి కార్యాచరణను రూపొందిస్తున్నామని ఆర్థిక మంత్రి తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో లక్ష రూపాయల లోపు రుణమాఫీ ఇప్పటికీ పూర్తి కాలేదు. ఇందుకోసం రూ.770 కోట్లు కావాల్సి ఉన్నదని అధికార వర్గాలు తెలిపాయి. రెండు లక్షల రూపాయల లోపు రుణ మాఫీకి ఎంతమంది అర్హులు ఉన్నారని తెలుసుకొనే పనిలో అధికారులున్నారు.

మెదక్ జిల్లాలో రూ.2లక్షల లోపు రుణ గ్రహీతలు 1.50 లక్షల మంది వరకు ఉన్నారని అంచనా. రుణాలను మాఫీ చేస్తే వీరందరికీ ప్రయోజనం చేకూరనున్నది. మెదక్ జిల్లాలో 2.16 లక్షల మంది రైతుబంధు సాయం పొందుతున్నారు. రైతులకు పెట్టుబడి సాయం రూ. 15వేలకు పెంచితే వీరందరికీ ప్రయోజనం చేకూరనున్నది. పసల్‌బీమా పథకానికి 14,693 మంది అర్హులు ఉన్నారు. వీరందరికీ పంటల బీమాతో మేలు జరుగుతుంది.

సాగునీటి ప్రాజెక్టులకు నిధులిస్తారా?

బడ్జెట్‌లో నీటిపారుదలశాఖకు రూ.28వేల కోట్లను కేటాయించారు. అయితే జిల్లాలోని సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకం, సింగూరు ప్రాజెక్టు కాల్వల పనులు, మెదక్ జిల్లా ఘన్‌పూర్ ఆనకట్ట ఎత్తు పెంపునకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులను కేటాయించలేదు. దీంతో సంగారెడ్డి, మెదక్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి పథకాలకు నిధుల కేటాయింపు ఉంటుందో? ఉండదోనని ఆందోళనను రైతులు వ్యక్తం చేస్తున్నారు.

మెట్రో రైలు ఊసే లేదు

మియాపూర్-పటాన్‌చెరు మెట్రో రైలు ప్రస్తావన బడ్జెట్‌లో లేకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం రేవంత్‌రెడ్డి ఇటీవల నగరంలో ట్రాఫిక్ రద్దీపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మెట్రో రైలుకు సంబంధించిన పలు ప్రతిపాదనల్లో భాగంగా మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు మెట్రో రైలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అయితే దీనిపై బడ్జెట్‌లో ప్రస్తావన కానీ, నిధుల కేటాయింపుకానీ లేకపోవడం గమనార్హం.

ఏడుపాయలకు మొండిచేయి

రాష్ట్రంలోని ప్రముఖ క్షేత్రాలైన వేములవాడ, భద్రచలం, బాసర, ధర్మపురి అభివృద్ధికి బడ్జెట్‌లో ప్రాధాన్యమిచ్చారు. కానీ, మెదక్ జిల్లాలోని ఏడుపాయల వనదుర్గ క్షేత్రం అభివృద్ధికి నిధుల మంజూరు గురించి బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం విమర్శలకు తావిస్తున్నది. అలాగే, మెదక్ పట్టణం చుట్టూ రింగురోడ్డుకు నిధులు ఈ బడ్జెట్‌లో కూడా రాలేదు. గత ప్రభుత్వం మెదక్ మున్సిపాలిటీకి రూ. 50 కోట్లు, రామాయంపేట, తూప్రాన్, నర్సాపూర్ మున్సిపాలిటీలకు రూ. 25 కోట్ల చొప్పు స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కేటాయించింది. కానీ ఆయా పనులు ప్రారంభం కాకపోవడంతో కొత్త ప్రభుత్వం రద్దు చేసింది. అయితే, పురపాలికలకు రూ. 11,692 కోట్ల నిధులను కేటాయిస్తున్నట్టు భట్టివిక్రమార్క బడ్జెట్‌లో పేర్కొనడంతో, ఇందులో భాగంగా మెదక్‌తో పాటు మిగిలిన బల్దియాలకు కూడా నిధులు వచ్చే అవకాశం ఉంటుంది. మెదక్ రింగురోడ్డుకు కూడా బల్దియా నిధుల నుంచి కేటాయింపులు సాధించాలని ప్రజలు ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

ప్రజలు మెచ్చే బడ్జెట్



రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మొదటిసారి ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలు మెచ్చేలా ఉంది. ప్రజా సంక్షేమంతో పాటు అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని బడ్జెట్ రూపొందించారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలుకు ప్రాధాన్యమిచ్చారు. వ్యవసాయరంగానికి నిధులు కేటాయించడం శుభసూచకం.

-అంజనేయులుగౌడ్, డీసీసీ అధ్యక్షుడు

అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారు



రాష్ట్ర బడ్జెట్ అరచేతిలో వైకుంఠం చూపినట్టు ఉంది. లెక్కల్లో కేటాయింపులు చూపించినా నిధులు ఎక్కడి నుంచి తెస్తారో చెప్పలేదు. గొప్పలు చెప్పడం తప్ప చేసేదేమీ కనిపించడం లేదు. ఎన్నికల హామీలను నెరవేర్చేందుకు నిధుల కేటాయింపు అంతంత మాత్రంగానే ఉంది. ఆరు గ్యారెంటీల అమలుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

-సునీతారెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే

ఈసారి తప్పదా?

ప్రజలు వ్యతిరేకించినా ప్యారానగర్‌లో డంపింగ్ యాడ్ ఏర్పాటుకే మొగ్గు



ప్యారానగర్‌లో డంపింగ్‌యార్డ్ కోసం కేటాయించిన భూమి

- చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్ నిర్మాణం
- ఉమ్మడి రాష్ట్రంలోనే 150 ఎకరాల భూమి కేటాయింపు
- పచ్చగా కళకళలాడే ప్రాంతం.. కానుందా మరో జవహర్‌నగర్?
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు

గుమ్మడిదల, ఫిబ్రవరి 10: చుట్టూ పచ్చని అడవితో కళకళలాడే ప్యారానగర్‌లో డంపింగ్‌యార్డు వద్దని పది గ్రామాల ప్రజలు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నా.. జీహెచ్ఎంసీ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. డంపింగ్‌యార్డ్ ఏర్పాటుకే మొగ్గుచూపుతున్నది. జీహెచ్ఎంసీ పరిధిలో సేకరించిన చెత్తను డంపింగ్ చేయడానికి సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారానగర్ గ్రామ శివారులో డంపింగ్‌యార్డును చేర్పాటు చేయడానికి ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. అటవీ, పర్యావరణ అనుమతులు కూడా రావడంతో పనులను ప్రారంభించారు.

ఉమ్మడి రాష్ట్రంలోనే భూ కేటాయింపు

ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడే ప్యారానగర్ శివారులో డంపింగ్‌యార్డ్ కోసం 150 ఎకరాలను అప్పటి ప్రభుత్వం కేటాయించింది. యార్డుకు చేరుకునేందుకు అటవీ మధ్య నుంచి రోడ్డు నిర్మించడం కోసం రాష్ట్ర అటవీశాఖ 0.65 హెక్టార్ల స్థలం ఇచ్చేందుకు అంగీకరించినట్లు సమాచారం. ఈ స్థలం ఇచ్చినందుకు అటవీశాఖకు రూ. 60 లక్షలు పరిహారం ఇచ్చినట్టు జీహెచ్ఎంసీ అధికారి ఒకరు తెలిపారు. రోడ్డు కోసం తొలగించిన చెట్లకు బదులుగా మొక్కలను పెంచడం కోసం రూ. 80 లక్షలు కేటాయిస్తున్నట్టు పేర్కొన్నారు. ఇక్కడ చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి మాత్రమే చేయాలని ప్రాథమికంగా భావిస్తున్నారు. జవహర్‌నగర్‌లోనే చెత్తను సెగ్రిగేషన్ చేసి, విద్యుత్ ఉత్పత్తికి అవసరమయ్యే వ్యర్థాలను మాత్రమే ప్యారానగర్ తరలించే అంశాన్ని పరిశీలిస్తున్నట్టు అధికారులు పేర్కొంటున్నారు. రింగ్‌రోడ్డుకు నాలుగు వైపులా డంపింగ్ యార్డులను ఏర్పాటు చేయాలని ఉమ్మడి రాష్ట్రంలోనే నిర్ణయించారని, లక్డారం వద్ద 150 ఎకరాలు, ఖానాపూర్‌లో 42 ఎకరాల స్థలాన్ని పరిశీలిస్తున్నట్టు అధికార వర్గాలు పేర్కొన్నాయి.


వ్యతిరేకిస్తున్న ప్రజలు

ప్యారానగర్‌లో డంపింగ్‌యార్డ్ ఏర్పాటును గ్రామస్థులు వ్యతిరేకిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనే భూ కేటాయింపు జరిపినా ప్రజల వ్యతిరేకతకు తలొగ్గి అప్పట్లో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. కానీ, రెండేళ్ల క్రితం మరోసారి ఈ ప్రతిపాదన తెరపైకి వచ్చింది. దీంతో చుట్టుపక్కల 10 గ్రామాల ప్రజలు ఉధృతంగా ఆందోళనలు చేశారు. పది గ్రామాల ప్రజలు డంపింగ్‌యార్డు వద్దని ఏకగ్రీవంగా తీర్మానాలు చేసి ప్రభుత్వానికి అందజేశాయి. దీంతో డంపింగ్‌యార్డు పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం పనులు వేగంగా జరుగుతుండడంతో మరోసారి స్థానికులు ఆందోళనలకు దిగుతున్నారు. రెవెన్యూ అధికారుల మాటలు బట్టి ఈసారి డంపింగ్‌యార్డు ఏర్పాటుపై వెనక్కి తగ్గే అవకాశం లేదని తెలుస్తున్నది. దీంతో, ప్రజల ఆందోళనలకు మద్దతిచ్చేందుకు ప్రతిపక్షాలు సిద్ధమవుతుండడంతో స్థానికంగా ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది.

పర్యావరణానికి తీరని నష్టం

హైదరాబాద్ నగరానికి సమీపంలో ఉన్నా గుమ్మడిదల మండలంలో వ్యవసాయమే ప్రజల ప్రధాన జీవనాధారం. ఆధునిక సాగు విధానాలకు ఇక్కడి రైతులకు జిల్లాస్థాయిలో గుర్తింపు ఉంది. మండలంలో అటవీ భూములు కూడా విస్తారంగానే ఉన్నాయి. ప్రశాంతమైన వాతావరణం, పచ్చని పొలాలకు నెలవైన ఈ ప్రాంత రైతులు డంపింగ్‌యార్డ్ ఏర్పాటు చేయడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్‌యార్డు నుంచి వెలువడే కాలుష్యం, దుర్గంధంతో చుట్టుపక్కల పది గ్రామాల్లో ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని ఆందోళన చెందుతున్నారు. భూగర్భ జలాలు కలుషితమై వ్యవసాయం కుంటుపడుతుందని వాపోతున్నారు. రూ. కోట్లు విలువ పలికే భూముల ధరలు ఒక్కసారిగా పడిపోతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


10 గ్రామాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారు



ప్యారానగర్‌లో డంపింగ్‌యార్డు ఏర్పాటు చేస్తే గుమ్మడిదల మండలంలోని 10 గ్రామాలు ప్రభావితమవుతాయి. పది గ్రామాల ప్రజల అభిప్రాయాన్ని ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతాం. ఇప్పటికే పంచాయతీలు ఏకగ్రీవంగా చేసిన తీర్మానాలను ఉన్నతాధికారులకు అందజేసి, డంపింగ్‌యార్డు ఏర్పాటును విరమించుకోవాలని కోరాం.

- కుమార్‌గౌడ్, జడ్పీటీసీ, గుమ్మడిదల మండలం

ప్రాణాలు పోయినా ఒప్పుకోం



నల్లవల్లి పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ శివారులో జీహెచ్ఎంసీ చెత్త డంపింగ్‌యార్డు ఏర్పాటు చేయడానికి ఎట్టిపరిస్థితుల్లోనూ ఒప్పుకోం. పచ్చటి పంటలతో కళకళలాడే ఈప్రాంతాన్ని కాలుష్య కాసారంగా చేయవద్దని ప్రభుత్వాన్ని, అధికారులను వేడుకుంటున్నాం. ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా డంపింగ్‌యార్డు ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తే ప్రాణాలు ఫణంగా పెట్టి ఉద్యమిస్తాం.

-దోమడుగు శంకర్, మాజీ సర్పంచ్, నల్లవల్లి గ్రామం

డంపింగ్‌యార్డు వస్తే ఊళ్లో ఉండలేం



హైదరాబాద్ నగరం చెత్తనంతా ప్యారానగర్‌కే తరలిస్తే ఈ ప్రాంతం కాలుష్య కాసారంగా మారుతుంది. గ్రామంలో ప్రజలు నివసించలేరు. ప్రజల వ్యతిరేకతను అర్థం చేసుకుని డంపింగ్‌యార్డు ఏర్పాటును విరమించుకోవాలి.

-మణెమ్మ, నల్లవల్లి గ్రామస్థురాలు

ప్రజల అభిప్రాయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తాం

ప్యారానగర్‌లో డంపింగ్‌యార్డు ఏర్పాటుపై ప్రజల వ్యతిరేకతను కలెక్టర్ దృషికి తీసుకువెళ్తాం. ఇక్కడ డంపింగ్‌యార్డు ఏర్పాటు కోసం భూ కేటాయింపు, అనుమతుల మంజూరు ఉమ్మడి రాష్ట్రంలోనే జరిగాయి. ఈమేరకు ప్రస్తుతం జీహెచ్ఎంసీ అధికారులు పనులు వేగవంతం చేశారు. దీనిపై ప్రజల వ్యతిరేకతను ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

-గంగాభవానీ, తహసీల్దార్, గుమ్మడిదల మండలం

విద్యార్థులు ప్రణాళికతో చదవాలి

● పరీక్షలంటే భయం వీడాలి ● మెదక్ కలెక్టర్ రాజర్షిషా



ప్రేరణ తరగతుల కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 10: విద్యార్థులు ప్రణాళిక రూపొందించుకొని చదవాలని మెదక్ కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. శనివారం స్థానిక టీఎన్జీవో భవన్‌లో పదో తరగతి విద్యార్థులకు బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రేరణ తరగతులను కలెక్టర్ సావిత్రిబాయి పూలే జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలంటే భయం.. ఒత్తిడికి గురికాకుండా ఇష్టంతో చదవాలని సూచించారు. జీవితంలో ఏది సాధించాలన్నా చదువు తప్పనిసరని, సందేహాలు తొలగించడానికి ప్రేరణ తరగతులు బాగా ఉపయోగపడుతాయన్నారు. ప్రభుత్వ విద్యాలయాల్లో ఉన్నతమైన సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు ఉన్నత చదువులపై ప్రేరణ కల్పిస్తూ... పదిలో శత శాతం ఫలితాలే లక్ష్యంగా కృషి చేయాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా 22 బీసీ వసతి గృహాల్లో 222 మంది పది విద్యార్థులు ఉన్నారని, పరీక్షల సమయంలో వార్డెన్లు ప్రత్యేక దృష్టిసారించి చదివించాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పెన్నులను అందజేశారు. ఈ సమావేశంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్ష, కార్యదర్శి నరేందర్, రాజ్‌కుమార్, జిల్లా అదనపు బీసీ సంక్షేమాధికారి నాగరాజు గౌడ్, నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి, పుల్లూరుబండ జాతరలో భక్తుల రద్దీ

కిక్కిరిసిన పుల్లూరుబండ

● ఇతర రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తజనం ● ఆధ్యాత్మికతను సంతరించుకున్న ఆలయ పరిసరాలు

సిద్దిపేటరూరల్, ఫిబ్రవరి 10: సిద్దిపేట రూరల్ మండలంలోని పుల్లూరు బండ జాతర రెండోరోజు భక్తులతో కిక్కిరిసింది. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆలయ రంగాచారి, వంశపారంపర్య అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారికి గోపాల కాల్వలు సేవ, సుదర్శన నారసింహ హోమం, విష్ణుసహస్ర నామ పారాయణం నిర్వహించి, ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి బండపై ఊరేగించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ఆలయ పరిసరాలు ఆధ్యాత్మికతను సంతరించుకున్నాయి. జాతర సందర్భంగా బండపై ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల, ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు వస్తున్న నేపథ్యంలో వారికి ఇబ్బందులు కలుగకుండా ఆలయ నిర్వాహకులు అధికారులతో కలిసి అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా సిద్దిపేట రూరల్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతరకు వచ్చే భక్తులకు తాగునీటి వసతితో పాటు, అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే విధంగా వైద్య సదుపాయం కూడా కల్పించారు. పుల్లూరు బండ జాతరలో సిద్దిపేట రూరల్ మండలం జడ్పీటీసీ కోటగిరి శ్రీహరిగౌడ్, పలువురు ప్రముఖులు పాల్గొని లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కనకయ్యగౌడ్, డైరెక్టర్లు, మాజీ సర్పంచ్ నరేశ్‌గౌడ్, ఎంపీటీసీ లతావెంకట్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ రంగాచారి, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


లక్ష్మీ నరసింహస్వామి ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

నవోదయ 9, 11వ తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంతం

● దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు 2161 మంది
● పరీక్షకు 1548 మంది విద్యార్థుల హాజరు
● 613 మంది గైర్హాజరు


పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్

వర్గల్, ఫిబ్రవరి 10: కేంద్ర ప్రభుత్వం మానవ వనరుల శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-2025 విద్యా సంవత్సరం కోసం 9వ తరగతి, 11వ తరగతిలో ప్రవేశానికి శనివారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్, వర్గల్ నవోదయ విద్యాలయంలో నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ డి.రాజేందర్ తెలిపారు. 11వ తరగతి ప్రవేశ పరీక్షకుగాను 1052 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. 773 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. 273 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. 9వ తరగతి ప్రవేశ పరీక్షకుగాను 1109 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. 775 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. 334 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. 11వ తరగతి ప్రవేశ పరీక్షకు 73.47 శాతం, 9వ తరగతి ప్రవేశ పరీక్షకు 69.88 హాజరు శాతం నమోదైనట్లు తెలిపారు. 11వ తరగతి ప్రవేశ పరీక్షకుగాను 3 పరీక్షా కేంద్రాలు, 9వ తరగతి ప్రవేశ పరీక్షకు 4 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రాలను గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్, జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. 9వ తరగతి, 11వ తరగతి ప్రవేశ పరీక్షకుగాను 2161 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 1548 మంది పరీక్షకు హాజరుకాగా.. 613 విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.

పరిశీలించిన ఏసీపీ

గజ్వేల్, ఫిబ్రవరి 10: జవహర్ నవోదయ విద్యాలయం ప్రవేశ పరీక్షా కేంద్రాలను గజ్వేల్ ఏసీపీ మడత రమేశ్ శనివారం పరిశీలించారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్‌లోని ఆయా కేంద్రాలను సందర్శించిన ఆయన బందోబస్తు నిర్వహిస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్‌ను పటిష్టంగా అమలయ్యేలా చూశారు. వారితో గజ్వేల్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఒక ఎంపీ సీటు కోరతాం

● పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు
● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి


హుస్నాబాద్‌లోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్, ఫిబ్రవరి 10: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తాము కాంగ్రెస్ పార్టీతో కలిసి పోటీలో దిగే అవకాశాలు ఉన్నాయని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి చెప్పారు. ఒక వేళ అదే జరిగితే రాష్ట్రంలో ఒక ఎంపీ స్థానాన్ని తమకు ఇవ్వాలని కోరతామని అన్నారు. అయితే ఈ విషయమై ఇంకా ఎలాంటి చర్చలు జరగలేదని, అసెంబ్లీ సమావేశాల తర్వాత కలిసి మాట్లాడతామని వెల్లడించారు. శనివారం వెంకటరెడ్డి హుస్నాబాద్‌లోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోవడాన్ని జీర్ణించుకోలేక పోతోందని అన్నారు. కొత్త ప్రభుత్వం వచ్చి 60 రోజులు కాకముందే దానిపై అనేక ఆరోపణలు చేయడం సరికాదని హితవు పలికారు. దేశంలో ఇండియా కూటమి ద్వారానే ప్రజాస్వామ్య మనుగడ ఉంటుందని, కూటమిలో నుంచి కొంత మంది వెళ్లిపోయినా ఏం ఫర్వాలేదని అన్నారు. కృష్ణా, గోదావరి జలాలతో పాటు ఇరిగేషన్ ప్రాజెక్టులపై అన్ని పార్టీలతో సమావేశం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. భూములపై సర్వేనెంబర్ల వారీగా సమగ్ర సర్వే చేయాలని అన్నారు. నరేంద్రమోదీ పదేళ్ల పాలనలో ఏ ఒక్క హామీ అమలు చేయలేదని, మొహం చెల్లక ఇప్పుడు రాముడి పేరుతో ఆయన ఓట్లు అడుగుతున్నారని వెంకటరెడ్డి దుయ్యబట్టారు.

దేవాదుల కాలువలో వ్యక్తి అస్థిపంజరం

● నాగపురి శివారు కొండపోచమ్మ ఆలయ సమీపంలో గుర్తింపు


దుబ్బాక సుభాష్ (ఫైల్)

చేర్యాల, ఫిబ్రవరి 10: చేర్యాల మండలం నాగపురి గ్రామశివారు, కొండపోచమ్మ ఆలయ సమీపంలోని దేవాదుల కాలువలో ఓ వ్యక్తి అస్థిపంజరం శనివారం లభ్యమైంది. అనుమానాస్పద స్థితిలో కొద్దిరోజుల క్రితం కాలువలో పడిపోవడంతో మృతదేహం కుళ్లిపోయింది. దుర్వాసన వెదజల్లడంతో చుట్టుపక్కల వారు గమనించి కొమురవెల్లి పోలీసులకు సమాచారమందించడంతో ఎస్ఐ నాగరాజు మృతదేహాన్ని వెలికి తీయించారు. అయితే విచారణ చేపట్టిన పోలీసులు మృతదేహం హైదరాబాద్ నగరం మల్లాపూర్ గ్రామానికి చెందిన దుబ్బాక సుభాష్‌గా గుర్తించారు. గతనెల 23న కొండపోచమ్మ ఆలయ సందర్శనార్థం వచ్చిన క్రమంలో తప్పిపోయాడని ఇటీవల జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో మృతుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. దీంతో మృతదేహం ఆనవాలు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారమందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని అంగీకరించారు. వారి సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడికి మతిస్థిమితం సరిగా లేనందున తప్పిపోయి కాలువలో పడి మృతిచెంది ఉంటాడని పోలీసులు తెలిపారు.

'ఇథనాల్' నిర్మాణానికి అనుమతులున్నాయి

● ఫ్యాక్టరీకి సంబంధించి ఆస్తులు ధ్వంసం చేస్తే చర్యలు
● సిద్దిపేట రూరల్ సీఐ ఎం.శ్రీనివాస్
● ఫ్యాక్టరీకి అనుమతులు ఇస్తే ఆందోళన చేస్తాం


ఫ్యాక్టరీ ఎదుట పెట్రోల్ క్యాన్, పురుగుల మందు డబ్బాతో నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

బెజ్జంకి, ఫిబ్రవరి 10: ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి అన్ని అనుమతులు ఉన్నాయని, ఫ్యాక్టరీకి సంబంధించిన ఆస్తులు ధ్వంసం చేస్తే చర్యలు తప్పవని సిద్దిపేట రూరల్ సీఐ ఎం.శ్రీనివాస్ హెచ్చరించారు. బెజ్జంకి మండలంలోని గుగ్గిళ్ల గ్రామ శివారులో 557, 559, 561 సర్వే నెంబర్లలో చేపట్టిన ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణం రోజురోజుకూ వివాదమవుతున్నది. కొద్దినెలలుగా ఫ్యాక్టరీ నిర్మాణాన్ని ఆపేయాలని గ్రామస్థులు ఆందోళనలు చేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం సిద్దిపేట రూరల్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ నిర్మాణంపై గ్రామస్థులకు అవగాహనా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గుగ్గిళ్ల గ్రామ శివారులో నిర్మిస్తున్న సదరు కంపెనీకి ప్రభుత్వపరంగా అన్నిరకాల అనుమతులు ఉన్నాయని, కంపెనీ యధావిధిగా పనులు కొనసాగిస్తున్నదని తెలిపారు. కంపెనీ నిర్మాణం పట్ల గ్రామస్థులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే లీగల్‌గా వెళ్లాలని సూచించారు. చట్ట విరుద్ధంగా వ్యవహరించి ఆస్తులు ధ్వంసం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. కాగా అవగాహన సమావేశం అనంతరం గ్రామస్థులు ఫ్యాక్టరీ ఎదుట పురుగుల మందు డబ్బాలతో, పెట్రోల్ క్యాన్‌తో నిరసన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ పేరుతో తమ భూములను నిర్వీర్యం చేస్తే చూస్తూ ఊరుకోమని, ఎలాంటి పోరాటాలకైనా సిద్ధమవుతామని హెచ్చరించారు. మీ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు. ఎస్ఐ నరేందర్ రెడ్డి, గుగ్గిళ్ల గ్రామస్థులు పాల్గొన్నారు.


గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్

అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో సిద్దిపేటకు డబుల్ గోల్డ్ మెడల్స్



జితేష్‌ను అభినందిస్తున్న అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 10: తెలంగాణ 9వ సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా శనివారం భద్రాద్రి కొత్తగూడెంలో నిర్వహించిన స్టాండింగ్ బ్రాడ్ జంప్, పరుగు పందెంలో సిద్దిపేటకు రెండు గోల్డ్ మెడల్స్ దక్కాయి. సిద్దిపేట క్రీడాకారుడు గాడిచర్ల జితేష్ స్టాండింగ్ బ్రాడ్ జంప్‌లో 1.94 మీటర్లు ప్రథమ స్థానంలో, 300 మీటర్లు పరుగు పందెం 49 సెకన్లలో పూర్తిచేసి ప్రథమ స్థానంలో నిలిచి రెండు గోల్డ్ మెడల్స్ సాధించాడు. ఈ మేరకు అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి క్రీడాకారులకు గోల్డ్ మెడల్స్‌ను, మెమెంటోలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేటకు డబుల్ గోల్డ్ మెడల్ రావడం అభినందనీయమని, క్రీడాకారులు ఇదే స్ఫూర్తితో మరిన్ని క్రీడల్లో పాల్గొని అవార్డులను పొందాలన్నారు. గోల్డ్ మెడల్ సాధించినందుకు అథ్లెటిక్స్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, కార్యదర్శి వెంకటస్వామి, కోచ్ కల్లపల్లి కృష్ణ అభినందించారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

● జిల్లా విద్యాధికారి రాధాకృష్ణ



విద్యార్థులకు సూచనలిస్తున్న రాధాకృష్ణ

వెల్దుర్తి, ఫిబ్రవరి 10: పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించి, పాఠశాలకు పేరు తేవాలని జిల్లా విద్యాధికారి రాధాకృష్ణ సూచించారు. శనివారం మండల పరిధిలోని మంగళపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి, పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. వారికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి జీవితంలో తొలిమెట్టు పదో తరగతి అని, ప్రతీ రోజు పాఠశాలకు హాజరై ఇష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని ఆయన సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మెహర్‌బేగం, ఉపాధ్యాయులు రామగౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిన సెలవు హర్షించదగ్గ విషయం

● ఎమ్మెల్యే సంజీవరెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డికి సేవాలాల్ చిత్రపటాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి



ఖేడ్‌లో సంబురాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 10: గిరిజనుల ఆరాధ్యదైవం సంత్‌సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ఈ నెల 15న సెలవు దినంగా ప్రకటిస్తూ, జీవో జారీ చేయడం పట్ల ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేయడంతో పాటు బంజారాహిల్స్‌లో వచ్చే జయంతి నాటికి సేవాలాల్ మహారాజ్ విగ్రహ స్థాపన జరుగుతుందని, గోర్‌బోలిని 8వ షెడ్యూల్‌లో చేర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపుతుందని, సేవాలాల్ చిత్రాన్ని నాణేలపై ముద్రించేందుకు సిఫార్సు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలకు సేవాలాల్ చిత్రపటాన్ని బహూకరించి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, తదితరులు ఉన్నారు.

ఖేడ్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంబరాలు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 10: గిరిజనులకు ప్రయోజనం చేకూర్చే పలు నిర్ణయాలను ప్రభుత్వం తీసుకున్న నేపథ్యంలో శనివారం ఖేడ్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. పట్టణంలో కాంగ్రెస్ శ్రేణులు గిరిజన సంఘాల నాయకులతో కలిసి సేవాలాల్ మహారాజ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి చిత్రపటాలతో ఎమ్మెల్యే నివాసం నుంచి రాజీవ్ చౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. చౌక్‌లో చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జీవ్లా నాయక్, మాజీ జడ్పీటీసీ సర్దార్, సేవాలాల్ సంఘం రాష్ట్ర నాయకులు రమేష్ చౌహాన్ పాల్గొన్నారు.

సెలువు ప్రకటించడంతో హర్షం

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 10: సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా అధికారికంగా సెలవు ప్రకటించడం హర్షించదగ్గ విషయమని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సేల్ జిల్లా అధ్యక్షుడు అశోక్ నాయక్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం సేవాలాల్ జయంతిని పట్టించుకోలేదన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



భిక్షపతి (ఫైల్)

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 10: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఉరేసుకుని యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన చిన్నశంకరంపేట మండలంలోని గవ్వపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన రెడ్డి భిక్షపతి(35) సంవత్సరం క్రితం వాటర్ ప్లాంట్ ఏర్పాటు కోసం రూ.20లక్షలు అప్పు చేశాడు. వాటర్ ప్లాంట్ వ్యాపారం సరిగా నడువకపోవడంతో, అప్పులు భారం అయ్యాయి. అప్పులు తీర్చలేక మనస్తాపం చెందిన భిక్షపతి వాటర్ ప్లాంట్ రూంలోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నారాయణగౌడ్ తెలిపారు.

వాహనాలు ఢీకొని ఇరువురికి గాయాలు

రేగోడు, ఫిబ్రవరి 10: ఆటో, ద్విచక్రవాహనం ఢీకొని ఇరువురు గాయపడ్డారు. ఈ సంఘటన రేగోడు మండలంలోని ఆర్ ఇటిక్యాల గ్రామ శివారులో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... రేగోడు మండలం కొండాపూర్ నుంచి ద్విచక్ర వాహనంపై సాయిలు అల్లాదుర్గం వైపు వెళ్తున్నాడు. అల్లాదుర్గం నుంచి రేగోడు వైపు ఆటో వెళ్తున్నది. ఈ క్రమంలో ఆర్.ఇటిక్యాల గ్రామ శివారులో రెండు వాహనాలు ఢీకొనగా సాయిలుతో పాటు ఆటోలో ఉన్న సత్యమ్మ గాయపడ్డారు. వారిని 108 అంబులెన్స్ వాహనంలో నారాయణఖేడ్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రానిక్ రిపేర్ షాపు దగ్ధం

నర్సాపూర్, ఫిబ్రవరి 10: విద్యుదాఘాతంతో ఎలక్ట్రానిక్ రిపేర్ షాపు దగ్ధమైంది. నర్సాపూర్‌కు చెందిన బ్రహ్మం అనే వ్యక్తికి పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఎలక్ట్రానిక్ రిపేర్ షాపు ఉన్నది. శనివారం ఉదయం దుకాణం తెరిచి, బ్రహ్మం బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో విద్యుదాఘాతంతో మంటలు చెలరేగాయి. బ్రహ్మం అక్కడికి చేరుకుని స్థానికుల సహాయంతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తూ ఫైరింజన్ సిబ్బందికి సమాచారమందించాడు. వారు వచ్చి మంటలను ఆర్పారు. అప్పటికే దుకాణంలోని ఫ్రిడ్జ్‌లు, జిరాక్స్ మిషన్, సెల్‌ఫోన్లు తదితర వస్తువులు కాలిపోయాయి. ఈ ఘటనలో రూ.2లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

ట్రాక్టర్ దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్

నారాయణఖేడ్, ఫిబ్రవరి 10: ట్రాక్టర్ దొంగతనం చేసిన నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి శనివారం తెలిపారు. మండల కేంద్రమైన నిజాంపేటకు చెందిన గొల్ల సాయిలు గత నెల 3న తన ట్రాక్టర్‌ను గ్రామ శివారులోని పరమేశ్వర్ పొలం వద్ద నిలపగా చోరీకి గురైంది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో నిజాంపేట జాతీయ రహదారిపై శుక్రవారం వాహనాలను తనిఖీ చేసే సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని పట్టుకుని విచారించారు. కామారెడ్డి జిల్లా బీచ్కుంద పట్టణంలోని శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన బంటూ శ్రీనివాస్(25), అదే గ్రామానికి చెందిన అంజయ్యతో కలిసి నిజాంపేటతో పాటు సంగారెడ్డిలో మరో ట్రాక్టర్‌ను దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. ఇద్దరినీ అరెస్ట్ చేసి ఖేడ్ కోర్టులో హాజరుపరిచామన్నారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడని, త్వరగా పట్టుకుంటామని సీఐ తెలిపారు.

కారును ఢీకొన్న బస్సు, ఒకరికి తీవ్ర గాయాలు

హవేళిఘణపూర్, ఫిబ్రవరి 10: కారును బస్సు ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని శాలిపేట గ్రామ శివారులో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ వైపు నుంచి కారులో ప్రభుత్వ ఉపాధ్యాయులు మైలారం రమణి, స్వర్ణబాయి, సుమలత, నాగలత, షఫీక్ ఉన్నిసా బేగం కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలంలో విధులు నిర్వర్తించేందుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని శాలిపేట గ్రామ శివారులోని టర్నింగ్ వద్ద కారును ఎల్లారెడ్డి నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు అతి వేగంతో వచ్చి ఢీ కొట్టింది. ప్రమాదంలో కారు నడుపుతున్న మైలారం రమణికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆస్పత్రికి తరలించారు. అజాగ్రత్త, అతివేగంతో బస్సునడిపిన బస్సు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు వచ్చినట్లు ఎస్‌ఐ ఆనంద్‌గౌడ్ తెలిపారు.

కర్నాల్‌పల్లి రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం



రేణుక ఎల్లమ్మ జమదగ్నిల నాగవెల్లి పటం

చేగుంట, ఫిబ్రవరి 10: చేగుంట మండలం కర్నాల్‌పల్లి రేణుకా ఎల్లమ్మ ఆలయం వార్షికోత్సవంలో భాగంగా మాఘ అమావాస్య రెండో రోజు రేణుకా ఎల్లమ్మ జమదగ్నిల నాగవెల్లి శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ జనగామ రాములుగౌడ్, గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ జనగామ రాములుగౌడ్ మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం మాఘ అమావాస్యను పురస్కరించుకుని రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. మూడు రోజుల పాటు ఆలయ ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు, బోనాల ఊరేగింపు, ఒగ్గు కళాకారులతో కథా కాలక్షేపం కార్యక్రమాలు చేపడుతామన్నారు. వివిధ జిల్లాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌గౌడ్, సభ్యులు అంజాగౌడ్, కిషన్‌గౌడ్, బాల్‌రాజుగౌడ్, యాదాగౌడ్, మల్లా గౌడ్, ఎల్లం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మెదక్ ఎంపీ సీటును మోదీకి బహుమతిగా ఇస్తాం

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్‌యాదవ్



విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

నర్సాపూర్, ఫిబ్రవరి 10: మెదక్ పార్లమెంటు సీటును వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించి ప్రధాని మోదీకి బహుమతిగా ఇస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్‌యాదవ్ పేర్కొన్నారు. శనివారం నర్సాపూర్ వచ్చిన సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలో పదేళ్ల పాలన అవినీతి లేకుండా, కుంభకోణాలు లేకుండా సాగిందని, మూడోసారి కూడా ప్రజలు మోదీని ప్రధానిని చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా మోదీ పాలనలో దేశంలో అన్ని ప్రాంతాలకు సమానంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందాయన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఆదరణ లేదన్నారు. ఈసారి మెదక్ పార్లమెంటు సీటును గెలిపించడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోడరాజేందర్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చిన్నరమేష్‌గౌడ్, రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దరమేష్‌గౌడ్, కౌన్సిలర్లు సురేష్, బుచ్చేస్, యాదగిరి, మాజీ ఎంపీపీ రమణ, పట్టణ పార్టీ అధ్యక్షుడు అంజిగౌడ్, నాయకులు నాగరాజు, నగేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అస్వస్థతకు గురై తండ్రి, కొడుకు మృతి

హత్నూర, ఫిబ్రవరి 10: హత్నూర మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామ శివారులో ఇటుక బట్టీల వద్ద ఒరిస్సా రాష్ట్రానికి చెందిన దంపతులు అమలాల్ మోహజీ(35), నర్మదా మోహజీ పనిచేస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి అమలాల్, అతడి చిన్న కొడుకు అన్ను(2) వాంతులు, విరోచనాలతో బాధపడుతుండగా శుక్రవారం అర్ధరాత్రి ఇటుక బట్టి యజమాని సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. అప్పటికే వారు మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. నర్మదా ఫిర్యాదు మేరకు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబీకులకు అప్పగించినట్లు ఎస్‌ఐ సుభాష్ తెలిపారు.

కేంద్రానివి ప్రజా వ్యతిరేక విధానాలు

● సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు

నర్సాపూర్, ఫిబ్రవరి 10: ప్రధాని మోదీ ఆధ్వర్యంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ కార్పొరేట్ రంగానికి, బడా బాబులకు మేలు చేసే విధంగా వ్యవహరిస్తున్నదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.నాగరాజు పేర్కొన్నారు. శనివారం నర్సాపూర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ... బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశంలో నిరుద్యోగం పెరిగిందని విమర్శించారు. పెట్టుబడిదారుల సంపద మాత్రం పెరుగుతుందని విమర్శించారు. సంవత్సరానికి కోటి ఉద్యోగాలు ఇస్తానని గొప్పలు చెప్పి ఉన్న ఉద్యోగాలను తొలగించిన ఘనత మోదీ ప్రభుత్వానిదని దుయ్యబట్టారు. దేశానికి వెన్నుముక అయిన రైతులకు మేలు చేయకపోగా రైతు వ్యతిరేక చట్టాలు తెచ్చి వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నదన్నారు. కేంద్రానికి వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టనున్న సమ్మెకు అందరు మద్దతు పలికాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు షకుర్, స్వామి పాల్గొన్నారు.

ప్రమాదాలపై ఎన్డీఆర్ఎఫ్ అవగాహన



రామాంతపూర్ గ్రామంలో నిర్వహించిన ఎన్డీఆర్ఎఫ్ సమీక్షా సమావేశంలో అధికారులు

మాసాయిపేట, ఫిబ్రవరి 10: పరిశ్రమలలో ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన తక్షణ చర్యలు, ప్రమాద సమయంలో రక్షణ చర్యలపై మాసాయిపేట మండలం రామాంతపూర్ గ్రామంలో గల రసాయన పరిశ్రమంలో శనివారం ఎన్డీఆర్ఎఫ్ విపత్తు నివారణ దళం ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. పరిశ్రమలో చేపడుతున్న రక్షణ చర్యలపై కార్మికులకు, గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పరిశ్రమంలోని పలు కెమికల్ ట్యాంకుల వద్ద తీసుకుంటున్న రక్షణ చర్యలను పరిశీలించారు. సమీక్ష సమావేశంలో తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి, ఆర్డీవో జయచంద్రరెడ్డి విపత్తు నివారణ దళం జీఎం మన్మోహన్, పరిశ్రమల శాఖ జీఎం లక్ష్మీకుమారి, పరిశ్రమ శాఖ సభ్యులు కృష్ణమూర్తి, మాసాయిపేట తహసీల్దార్ జ్ఞానజ్యోతి, ఆర్ఐ ధన్‌సింగ్, కంపెనీ మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ కాలేజీ వార్షికోత్సవం

నర్సాపూర్, ఫిబ్రవరి 10: నర్సాపూర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. ఈ ఉత్సవాలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ రవీందర్ మాట్లాడుతూ.. ప్రైవేటు కాలేజీలకు దీటుగా ప్రభుత్వ కాలేజీలో కూడా నాణ్యమైన విద్యనందిస్తూ, మంచి ఫలితాలు వచ్చేలా కృషి చేస్తున్నామన్నారు. చదువుతో పాటు విద్యార్థులకు ఆటపాటలు కూడా అవసరమని, క్రమశిక్షణతో ఉన్నతమైన లక్ష్యంతో ముందుకుసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో లెక్చరర్లు జ్యోత్స్నదేవి, నాగరాజు, ప్రణీత్, రాజేశ్వర్, కలింగారెడ్డి, రమాదేవి, ఫాతిమా, మాధవి, శ్రీహరి, నజీమా పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకే సైన్స్ పోటీలు

● మండల నోడల్ అధికారి ప్రతాప్‌రెడ్డి



పాపన్నపేట పాఠశాలలో సైన్స్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

పాపన్నపేట, ఫిబ్రవరి 10: విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకే సైన్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల నోడల్ అధికారి ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. పాపన్నపేట ఉన్నత పాఠశాలలో శనివారం మండల స్థాయిసైన్స్ పోటీలను నిర్వహించారు. ఇందులో భాగంగా చిత్రలేఖనం, కవితలు, పాటలు, ఉపన్యాస పోటీలను నిర్వహించి, ఉత్తమ ప్రతిభ కనబర్చిన నలుగురు విద్యార్థులను జిల్లాస్థాయికి ఎంపిక చేశారు. వీరికి ఈ నెల 12న సోమవారం మెదక్‌లోని బాలికల ఉన్నతపాఠశాలలో జిల్లాస్థాయి పోటీలు ఉంటాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, అశోక్,నాగరాజు, శశికుమార్‌రెడ్డి, అశోక్‌కుమార్, బెండల్‌పద్మ, సాయికుమార్, రవీందర్‌రెడ్డి, నర్సింలు, నరేందర్, ప్రసాద్, తులసీరాం, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

మాసాయిపేటలో

మాసాయిపేట: మండల కేంద్రమైన మాసాయిపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం సైన్స్ దినోత్సవం సందర్భంగా పలు అంశాలపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరచిన వారిని జిల్లా స్థాయికి పంపించనున్నట్లు పాఠశాల ఉపాధ్యాయుడు నారాజు రంగారెడ్డి తెలిపారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభా పాటవాలను వెలికితీయడానికి ఇలాంటి పోటీలు దోహదం చేస్తాయని సమావేశంలో పాల్గొన్న పలువురు పేర్కొన్నారు.

నిజాంపేటలో

నిజాంపేట: జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మండల స్థాయి పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి ఎస్.యాదగిరి, నిజాంపేట, కల్వకుంట ప్రధానోపాధ్యాయులు మహేందర్, రవీందర్, న్యాయ నిర్ణేతలు మోహన్, ఉమామహేశ్వర్, వెంకటేష్, ప్రవీణ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

● డీఎంహెచ్‌వో చందునాయక్



కార్యక్రమంలో మాట్లాడుతున్న చందునాయక్

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 10: జిల్లా వ్యాప్తంగా మార్చి 3న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఎంహెచ్‌వో చందునాయక్ అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో పల్స్‌పోలియో నిర్వహణపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. మార్చి3, 4, 5 తేదీల్లో ప్రతీ గ్రామంలో ఏర్పాటు చేసిన బూత్‌లో పల్స్ పోలియో కార్యక్రమం ఉంటుందన్నారు. ఆ రోజు అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు చుక్కల మందు వేయించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు విజయనిర్మల, డా.మాధురి, పీహెచ్‌సీ వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు



పతకాలు సాధించిన కంగ్టి ఎస్టీ బాలుర గురుకుల విద్యార్థులు

కంగ్టి, ఫిబ్రవరి 10: హన్మకొండ, వరంగల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-20, అండర్-15 స్థాయి కుస్తీ పోటీల్లో కంగ్టి ఎస్టీ బాలుర గురుకుల విద్యాలయానికి చెందిన విద్యార్థులు సత్తా చాటారు. ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన కుస్తీపోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయిలో అండర్-20 విభాగంలో పి.బాలాజీ, పి.దినేష్ కుమార్‌లు ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం కైవసం చేసుకున్నారు. అండర్-15 విభాగంలో పి.శివాజీ మూడోస్థానంలో నిలిచి కాంస్య పతకం దక్కించుకున్నాడు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రాయ్, వైస్ ప్రిన్సిపాల్ సంగీత, పీడీ.మహేష్, పీఈటీ విష్ణుతో పాటు ప్రజాప్రతినిధులు అభినందించారు.

అంగన్‌వాడీ కార్యకర్త ఇంట్లో సరుకులు

● బైక్‌పై తరలిస్తున్న భర్తను అడిగినందుకు దాడి

శివ్వంపేట, ఫిబ్రవరి 10: నిబంధనలకు విరుద్ధంగా అంగన్‌వాడీ సరుకులను ద్విచక్ర వాహనంపై అంగన్‌వాడీ టీచర్ భర్త తీసుకువస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. ఈ ఘటన మండలంలోని వెంక్యాతండాలో శనివారం చోటు చేసుకున్నది. మండలంలోని రెడ్యాతండా పంచాయతీ పరిధిలోని వెంక్యాతండా అంగన్‌వాడీ కేంద్రానికి సంబంధించిన సరుకులను టీచర్ రేణుక ఇంట్లో ఉంచి, అక్కడి నుంచి రోజు అవసరమైన మేరకు తన భర్త సహాయంతో కేంద్రానికి తెస్తున్నారు. ఈ క్రమంలో శనివారం 50కిలోల బియ్యం, మూడు గుడ్ల ట్రేలు, బాలామృతం సంచిని టీచర్ భర్త మోతిలాల్ తెస్తుండగా తండాకు చెందిన ఆంజనేయులు అనే వ్యక్తి అడ్డుకుని ప్రశ్నించాడు. దీంతో సదురు వ్యక్తిపై టీచర్ భర్త దాడి చేశాడు. దీంతో అతని పెదవి చిట్లీ తీవ్ర గాయమైంది. ఈ విషయమై పోలీసులకు బాధితుడు ఆంజనేయులు ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిని సంప్రదించగా అంగన్‌వాడీ కేంద్రానికి తలుపులు సరిగా లేనందునే, రక్షణ కోసం టీచర్ ఇంట్లో సరుకులు ఉంచి తీసుకువస్తున్నారని చెప్పారు. పోలీసులు విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

చెరువుల వద్ద జాగ్రత్తలు పాటించాలి: సీఐ

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 10: చెరువుల వద్ద ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి అన్నారు. శనివారం పెద్దశంకరంపేట మండల పరిధిలోని మల్కాపూర్ చెరువు వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దుస్తులు ఉతకడానికి గాని, ఈత కొట్టడానికి గాని ఎవరూ చెరువులోకి దిగరాదని పేర్కొన్నారు. చేపలు పట్టడానికి కరెంట్ తీగలను వినియోగించకూడదని, ఒకవేళ ఎవరైనా హద్దు మీరి వినియోగించినట్లయితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం, మత్తు పదార్థాలు సేవించి చేపలు పట్టడానికి, ఈత కొట్టడానికి చెరువులో దిగరాదని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శంకర్, పోలీసు సిబ్బంది మల్కాపూర్ గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలనపై ప్రజల్లో సానుకూలత



అనీల్‌కుమార్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న మంత్రికుంట నాయకులు

జిన్నారం, ఫిబ్రవరి 10: రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి పాలన పై ప్రజల్లో సానుకూలత కనిపిస్తున్నదని బొల్లారం మున్సిపల్ వైస్ చైర్మన్ అనీల్ కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం మంత్రికుంట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు నర్సింగ్‌రావు, ఆయన అనుచరులు అనీల్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. రెండు నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా సీఎం, ఇతర మంత్రులు పని చేస్తున్నారని అందుకే ఇతర పార్టీల నుంచి చేరుతున్నారని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సింగిల్ డిజిట్‌కే పరిమితం కానున్నందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజుగౌడ్, సీతారం యాదవ్, కిషోర్‌సింగ్, లక్ష్మన్ యాదవ్, రాజు, నాగేష్ పాల్గొన్నారు.

యువత క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనాలి

జహీరాబాద్, ఫిబ్రవరి 10: యువత క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనాలని హుగ్గెల్లి ఎంపీటీసీ రాములు పేర్కొన్నారు. శనివారం హుగ్గెల్లి తండాలో సేవాలాల్ మహారాజ్ పేరుతో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. విన్నర్ జట్టుకు రూ.25,111, రన్నర్ జట్టుకు రూ.15,111 చొప్పున నగదు, ట్రోఫీని అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు శంకర్, గోపాల్,నాయకులు రాథోడ్‌భీంరావ్, విజయ్‌రాథోడ్, దత్తురెడ్డి, సంజుపవార్, నరేష్‌చవ్హాన్, సంజుపవార్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.


చేగుంటలో

చేగుంట: చేగుంట మండల కేంద్రంలో సీసీఎల్ సీజన్-2 మండల స్థాయి క్రికెట్ పోటీలను శనివారం బీఆర్ఎస్ జిల్లా నాయకుడు రంగయ్యగారి రాజిరెడ్డి ప్రారంభించారు. క్రీడలు యువతకు ఎంతో దోహదపడుతాయన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, సమయస్ఫూర్తితో యువత క్రీడల్లో పాల్గొని మంచి ప్రతిభ చూపాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో నాయకులు డిష్ రాజు, అన్నం రవి, అయిత పరంజ్యోతి, మాజీ ఉపసర్పంచ్ రఘుపతి, నదీమ్, లాలా గణేష్, సోమ రవి, అలీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

అసెంబ్లీలో శనివారం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌పై మిశ్రమ స్పందన వచ్చింది. వ్యవసాయరంగానికి ప్రాధాన్యమివ్వలేదని, విద్యారంగానికి మరిచిపోయారంటూ పలువురు బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు.


సమతుల్య బడ్జెట్



మెదక్, ఫిబ్రవరి 10: ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకూ ఆమోదయోగ్యంగా ఉన్నది. నీటిపారుదల రంగానికీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల సంక్షేమానికి ఎంతగానో ప్రాధాన్యమిచ్చారు. విద్యా, వైద్య రంగాలకు సముచిత స్థానం కల్పిస్తూ ప్రజా ప్రభుత్వంగా కాంగ్రెస్ నిరూపించుకుంది.

- దొంత నరేందర్, టీఎన్జీవో అధ్యక్షుడు, మెదక్ జిల్లా

వ్యవసాయరంగానికి ప్రాధాన్యమివ్వలేదు



జహీరాబాద్, ఫిబ్రవరి 10: రాష్ట్ర ప్రభుత్వం శనివారం ప్రవేశపెట్టిన 2024-25 బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి ప్రాధాన్యమివ్వలేదు. వ్యవసాయరంగానికి ఏడాదికి గాను రూ.19,746 కోట్లు కేటాయించి, పాలకులు చేతులు దులుపుకునేలా బడ్జెట్ ఉన్నది. ఈ బడ్జెట్ వల్ల వ్యవసాయరంగం ముస్ముందు కుదేలవుతుంది. ఈ బడ్జెట్‌ను చూస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయరంగాన్ని విస్మరించినట్లు తెలుస్తున్నది. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని బడ్జెట్ పెంపునకు కృషి చేస్తే బాగుండేది.

- మల్కాపురం శివకుమార్, డీసీఎంఎస్ చైర్మన్

విద్యారంగానికి బడ్జెట్‌లో చోటేది

మెదక్, ఫిబ్రవరి 10: విద్యారంగానికి బడ్జెట్‌లో సమృద్ధిగా నిధుల కేటాయింపు లేకపోవడం శోచనీయం. కొఠారీ కమిషన్ నివేదిక ప్రకారం విద్యారంగానికి 12 శాతం నిధులు కేటాయించాల్సి ఉన్నప్పటికీ కేవలం రూ.21 కోట్లు ప్రవేశపెట్టడం విచారకరం.

- మల్లారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు

ఖేడ్‌కు నిధుల ప్రస్తావన మరిచారు

నారాయణఖేడ్: బడ్జెట్‌లో నారాయణఖేడ్ నియోజకవర్గానికి నిధుల ప్రస్తావన విషయాన్ని మర్చిపోయారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ మొత్తం రూ.2,75,891 కోట్లు ఉన్నప్పటికీ, వెనుకబడిన ప్రాంతమైన నారాయణఖేడ్ ప్రయోజనాల కోసం చేపట్టిన బసవేశ్వర ఎత్తిపోతల పథకం గురించి ఊసేత్తకపోవడం దారుణం. పరిశ్రమలు, ప్రాజెక్టులకు నిధులు కేటాయిస్తేనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- మాణిక్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు